క్లుప్తంగా

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, ఆలయ కమిటీ చైర్మన్ సంపెట గంగరాజు, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సోయినేని లహరి, అర్చకులు కార్తీక్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి మకరతోరణం అందజేత



కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో హనుమాన్ ఆలయానికి మాజీ ఉపసర్పంచ్ పబ్బు అంజయ్య మకరతోరణాన్ని అందజేశారు. గ్రామంలో హనుమాన్ ఆలయం కోసం ప్రత్యేకంగా రూ. 50 వేల ఖర్చుతో మకరతోరణాన్ని తయారు చేయించారు.

సన్మానం



సిరిసిల్లటౌన్: విశ్వంబర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 11న తిరుపతిలో ఆయుర్వేద వైద్యుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి ఆయుర్వేద వైద్యంలో సిద్ధహస్తులు పాల్గొన్నారు. ఆయుర్వేద వైద్యంతో ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి సత్కరించారు. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు జిందం కమలాకర్ సేవలను గుర్తించి ఆయనను సన్మానించి ప్రశంసాపత్రం, మెమొంటో అందించారు. త్వరలోనే పట్టణంలో ఆయుర్వేద మూలిక విజ్ఞాన సదస్సు నిర్వహిస్తానని కమలాకర్ పేర్కొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని మానేరు నదీ తీరంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గిరి ప్రదక్షిణ చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి విశేష అలంకరణతో పల్లకీలో గిరి ప్రదక్షిణ నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ తెలిపారు. గిరి ప్రదక్షిణలో ప్రముఖులు గజభీంకార్ రాజన్న, రాపెల్లి ఆనందం, మచ్చ ఆంజనేయులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



బోయినపల్లి: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరమని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులకు రూ.2.32 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు శనివారం పంపిణీ చేశారు. అనుముల హరికృష్ణ, రామస్వామి తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉందాం

ముస్తాబాద్: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రవాసీ మిత్ర యెల్ల రాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి, కక్షిదారులకు ఉపయోగపడేలా వాటర్ మిషన్‌ను తండ్రి యెల్ల బాల్‌రెడ్డి జ్ఞాపకార్థం రాంరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై చిందం గణేశ్, మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, కేకే సేన అధ్యక్షుడు అరుట్ల మహేశ్‌రెడ్డి, గజ్జెల రాజు, నాయకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అదుపుతప్పిన బైక్

కోనరావుపేట: నిమ్మపల్లిలో బైక్ అదుపుతప్పి దంపతులకు గాయాలయ్యాయి. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన వీర్యా దంపతులు బైక్‌పై సిరిసిల్లకు వెళ్తుండగా నిమ్మపల్లిలోని కొమురంభీమ్ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో గాయపడిన వీర్యా దంపతులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ముస్తాబాద్‌లో హోమంలో పాల్గొన్న హనుమాన్ దీక్షాపరులు



సిరిసిల్ల టౌన్ : పెద్దబజార్ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలను శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలన్నీ మార్మోగాయి. అర్చకులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. చందనం తమలపాకులు వేసి మల్లెపూల దండలతో అలంకరించా రు. స్వామివారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి పూజలుచేశారు. హనుమాన్ దీక్షాపరులు మాల విరమణ చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు అన్నదానం చేశారు. హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. – సిరిసిల్ల టౌన్/కోనరావుపేట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/తంగళ్లపల్లి/రుద్రంగి



రుద్రంగిలో పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారులు



ఎల్లారెడ్డిపేట హనుమాన్ ఆలయంలో..



సిరిసిల్ల టౌన్: భక్తులకు అన్నదానం



తంగళ్లపల్లి : పాపయ్యపల్లెలో హనుమాన్ శోభాయాత్ర



ఇల్లంతకుంట: హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు



కోనరావుపేట: మామిడిపల్లిలో జయంతి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

పురస్కారానికి ఎంపిక



మాసం సతీశ్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: జిల్లాకు చెందిన మాసం సతీశ్‌రెడ్డి అరుదైన పురస్కారానికి ఎంపికయ్యారు. సినిమా రంగంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఏటా దాసరి ఫిల్మ్ అవార్డ్స్ అందిస్తుంటారు. ఇటీవల విడుదలై విజయాన్ని సొంతం చేసుకున్న 'క' చిత్రానికి సతీశ్‌రెడ్డి డైరెక్టర్‌అఫ్ ఫొటోగ్రఫీ చేశారు. గతంలో సమ్మతమే, ఓ, రాంప్ చిత్రాలకు డీవోపీగా పని చేసినందుకు గాను ఆయనను దాసరి యువ ప్రతిభ అవార్డు– 2025కు ఎంపిక చేసినట్లు అవార్డ్స్ కమిటీ ఫౌండర్ చైర్మన్ తుమ్మలపల్లి రామాసత్యనారాయణ, అవార్డు కమిటీ సభ్యులు తమ్మారెడ్డి భరద్వాజ, సి.కళ్యాణ్, రేలంగి నరసింహారావు, జర్నలిస్టు ప్రభు శనివారం ప్రకటించారు. మే 1న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగే అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో సతీశ్‌రెడ్డి దా సరి యువ ప్రతిభ అవార్డును అందుకోనున్నారు.

నూతన కార్యవర్గం



సిరిసిల్లకల్చరల్ : విద్యానగర్ అభివృద్ధి సంఘానికి శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గుడ్ల కిషన్, రెడ్డిమల్ల కొండయ్య, ఉపాధ్యక్షుడిగా కె. జితేందర్, కోశాధికారిగా వేముల హరికృష్ణ, గుర్రం మహేందర్ ఎంపికైనట్లు ఎన్నికల నిర్వహణాధికారులు టి శ్రీదర్, సుభాష్‌రెడ్డి తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘం పూర్వ ప్రతినిధులు కార్తీక్, తిరుపతిరెడ్డి, గుర్రం ఆంజనేయులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

ఇల్లంతకుంట: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర మండలంలోని కందికట్కూర్ ఎస్సీకాలనీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు బిగుల్ల విజయ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, మండల ఇన్‌చార్జి నాయకుడు సూర దేవరాజు, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్ రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీలో కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి గడ్డం మధుకర్ (చోటు) ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది మహిళలు పాదయాత్రలో పాల్గొవడంతో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి నాయకులతో కలిసి కేకే డ్యాన్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, జిల్లా నాయకుడు చిలుక రమేశ్, నాయకులు చుక్క రాజశేఖర్, సుద్దాల శ్రీనివాస్, చెన్నమనేని ప్రశాంత్, ఎగుర్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీలో కాంగ్రెస్ నాయకులతో కేకే మహేందర్ రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరలు లభిస్తాయని ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేరా బేగం తెలిపారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఏపీఎం మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు ఎస్‌కే గౌస్, బండారి బాల్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, పోతుల శ్రీనివాస్, సీసీ దేవేందర్ పాల్గొన్నారు.



బుగ్గరాజేశ్వరతండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ సాబేరా బేగం

సీటుకోసం కొట్టుకున్నారు..

తంగళ్లపల్లి: ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. మహిళలు ఒకరికొకరు సీట్లకోసం గొడవపడటం చూశాం కానీ.. మహిళలతో పురుషుడు గొడవకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మండలంలోని నేరెళ్లలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట డిపోకు చెందిన ప్రైవేటు పల్లెవెలుగు బస్సు గురువారం వేములవాడ నుంచి సిద్దిపేటకు వెళ్తోంది. నేరెళ్లలోని రెసిడెన్షియల్ పాఠశాల మూలమలుపు వద్దకు చేరుకోగానే బస్సులో ఓ వ్యక్తికి ముగ్గురు మహిళలకు సీటుకోసం గొడవ మొదలైంది. సదరు వ్యక్తి మహిళలను దుర్భాషలాడటంతో పాటు వారిపైకి దాడికి దిగాడు. దీంతో డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. కండక్టర్ సదరు వ్యక్తిని కిందకు దింపివేయగా ముగ్గురు మహిళలు బస్సులోంచి దిగి అతడిపై కర్రలతో దాడిచేశారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు అతడిని పట్టుకునేందుకు యత్నించగా అక్కడినుంచి పరారయ్యాడు. ఈ తతంగాన్ని మొత్తం సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ విషయమై ఎస్సై రామ్మోహన్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బోయినపల్లి: మల్లాపూర్ శివారు మానేరువాగులో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసిన ట్లు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ శనివారం తెలిపారు. మానేరువాగులో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేసి వారినుంచి రూ. 8,200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వా ధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే 'గావ్ చలో'



ముస్తాబాద్: గూడూరులో మాట్లాడుతున్న పద్మ



కోనరావుపేట: మాట్లాడుతున్న నాయకులు

ముస్తాబాద్: ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే చలోగావ్ కార్యక్రమాన్ని బీజేపీ చేపట్టిందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి కామిటికార్ పద్మ అన్నారు. మండలంలోని గూడూరులో చలో గావ్, చలో బస్తీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, రేషన్‌షాప్, ఆరోగ్య కేంద్రాలను సందర్శించామని పద్మ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు హరిబాబు, దేవలక్ష్మి, మంజుల, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రధాని నరేంద్రమోదీతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు తీగల జయశ్రీ, మండల ఉపాధ్యక్షుడు చింతల పర్శరాములు అన్నారు. రామన్నపేట, కొండాపూర్ గ్రామాల్లో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామస్తులతో రచ్చబండ వద్ద సమావేశం నిర్వహించి మోదీ చేస్తున్న అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదగోని సాయికృష్ణ, గుడిసె మల్లయ్య, బుర్ర ఆంజనేయులు, కొలనూరి కరుణాకర్ రెడ్డి, పెద్ద ఆంజనేయులు, సుధాకర్, రాజేశం, సురేశ్, శంకర్, మల్లేశం, రాఘవులు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సైనికులు బొమ్మిడి స్వామి, దాసరి గణేశ్ కోరారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దాసరి పూర్ణిమ, పిట్ల శ్రీశైలం, పందిర్ల మధు, శాగ లక్ష్మణ్, గొర్రె మల్లేశ్, సంజీవ్, పవన్, సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మండల శాఖ అధ్యక్షుడు మాలోత్ లక్‌పతి నాయక్, వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మండల ఇన్‌చార్జి మార్త సత్తయ్య అన్నారు. మండలకేంద్రంలో క్రియాశీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు మాడుగుల లింబాద్రి, బీజేవైఎం మండల అధ్యక్షుడు బండారి మహేశ్, సీనియర్ నాయకులు, భట్టు పీర్య మాలోత్ ప్రకాశ్ బోనోత్ శ్రీనివాస్, నరేశ్, భూక్య రమేశ్, తౌటు గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల కల.. నెరవేరిన వేళ

- పూర్తయిన నక్కవాగు బ్రిడ్జి పనులు
- వర్షాకాలంలో తప్పనున్న కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

వేములవాడరూరల్: వర్షాకాలం వచ్చిందంటే ఆ ప్రాంత ప్రజల ఇబ్బందులు అన్నీ.. ఇన్నీ కావు. పొలాలకు వెళ్లేందుకు సైతం పడరాని పాట్లు పడేవారు. ఈ ప్రాంతంలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల తిప్పలు కూడా తక్కువేమి కావు. అరవై ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తీరాయి. గత ప్రభుత్వం ఈ వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు రూ.11.55 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో పనులు మొదలయ్యాయి. ఏడాదిపాటు సాగిన పనులు ప్రస్తుతం పూర్తికావడంతో శనివారం నూతన బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. మొదటిసారి బ్రిడ్జిపై ప్రయాణం చేస్తున్న ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇది వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట నక్కవాగుపై ఇటీవల పూర్తయిన బ్రిడ్జి. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం హన్మాజిపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాలతోపాటు కోనరావుపేట మండలం, నిజామాబాద్ జిల్లా వాసులు 60 ఏళ్లుగా ఎదురుచూశారు. ఎట్టకేలకు పనుల పూర్తికావడంతో ఈ ప్రాంత ప్రజల వాగు కష్టాలు తీరాయి. ప్రస్తుతం బ్రిడ్జి పూర్తికావడంతో రాకపోకలు మొదలయ్యాయి.

బాధలు తొలగనున్నాయి



ఏళ్లుగా ఈ ప్రాంత వాసులం వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందులు పడేవాళ్లం. వర్షం పడితే పొలాల వద్దకు పశువుల వద్దకు కూడా వెళ్లలేక ఇబ్బందులు పడ్డాం. అత్యవసర సమయంలో ఆస్పత్రులకు కూడా పోలేని పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ బ్రిడ్జి పూర్తయిన సందర్భంలో మా బాధలు తొలగాయి.

– మర్రిపల్లి శంకరయ్య, హన్మాజిపేట

ఏళ్ల కల



బ్రిడ్జి నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలను ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తయ్యాయి. వర్షాకాలం వాగు దాటాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. మాతోపాటు మరికొన్ని గ్రామాల ప్రజలు కూడా ఇక్కడి నుంచే వెళ్తారు. బ్రిడ్జి పూర్తి కావడంతో ఎంతో ఆనందంగా ఉంది.

– మెరుపుల అనంతరెడ్డి, హన్మాజిపేట

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



నిలిచిపోయిన బ్రిడ్జి పనులను ప్రత్యేక దృష్టి పెట్టి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనులు ప్రారంభించారు. ఏడాదికాలంగా జరుగుతున్న పనులు ప్రస్తుతం పూర్తి కావడంతో బ్రిడ్జి పై నుంచి ఈ ప్రాంత ప్రజలు వెళ్తున్నారు. ఈ వర్షాకాలం మా కష్టాలు దూరం కానున్నాయి. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఈ ప్రాంత ప్రజలం రుణపడి ఉంటాం.

– చిలుక ప్రభాకర్, హన్మాజిపేట

సహకరించిన వారికి కృతజ్ఞతలు



నక్కవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా కాంగ్రెస్ హయాంలో పనులు పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలం ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం బ్రిడ్జి కావడంతో ఈ ప్రాంత వాసిగా సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటాం.

– జంకె విజయ, మాజీ సర్పంచ్, హన్మాజిపేట



ఘనంగా రాములోరి రథోత్సవం

ముస్తాబాద్/ఇల్లంతకుంట: మండలంలోని పోతుగల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. దేవతా ఉత్సవ మూర్తులు రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు రథాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. రామలక్ష్మణ జానకీ అంటూ భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. ఆలయ కమిటీ చైర్మన్ తన్నీరు మలహర్‌రావు, మాజీ సర్పంచులు గౌతంరావు, పందిరి, నాయకులు వరి లక్ష్మణ్, చెక్కపల్లి రాజు, కారంగుల వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరులో శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా రథోత్సవం కార్యక్రమం జరిగింది. మహిళలు రథం ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పొత్తూరుతోపాటు పరిసర గ్రామాలైన నర్సక్కపేట, కందికట్కూర్, చొక్కారావుపల్లె, మల్లాపురం, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

ఇల్లంతకుంట: ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు తేదీని మరో వా రంరోజులు పొడిగించాలని జిల్లా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ తెలిపారు. దరఖాస్తుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యమవుతున్నందున దరఖాస్తు గడువు తేదీ పెంచాలని ఆయన కోరారు.